

## విద్యార్థి దశ నుండే ట్రాఫిక్ నియమాలపై
# అవగాహన ఉండాలి

**రోడ్డు భద్రతపై తల్లిదండ్రులలో చైతన్యం కల్పించడంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి : ఎస్పీ మహేష్ బి.గితే**

**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రతి విద్యార్థి విద్యార్థిదశ నుంచే ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. మంగళవారం అరైవ్ అలైవ్-3 కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పాఠశాలలను పోలీస్ అధికారులు సందర్శిస్తూ, విద్యార్థులకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నారని, ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుంచే వాహన చట్టాలు, ట్రాఫిక్ సిగ్నల్స్, నియమాలపై అవగాహన పెంపొందించుకోవడం వల్ల భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా నివారించవచ్చన్నారు. దీనిలో భాగంగా ప్రతి పోలీస్ అధికారి తమ పరిధిలోని విద్యాసంస్థలు సందర్శిస్తూ విద్యార్థులకు ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, హెల్మెట్ ,సీట్ బెల్ట్ వినియోగం, ర్యాష్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, మైనర్ డ్రైవింగ్ మొదలగు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులలో, కుటుంబ సభ్యులలో, సమాజంలో రోడ్డు భద్రతపై చైతన్యం కల్పించడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డుపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి ట్రాఫిక్ నియమాలను పాటించేలా విద్యార్థులు ప్రేరేపించాలని ఎస్పీ అన్నారు.

## ఉచిత ఎంసెట్ కోచింగ్ ప్రారంభం



**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత ఎంసెట్ కోచింగ్ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ ఎంసెట్ కోచింగ్ ను ఇదే కళాశాలలో 1977 -1979 వ సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు నాగుల రవి (రిటైర్డ్ మైనింగ్ డైరెక్టర్), పత్తిపాక మదన్ (రిటైర్డ్ ఇంజనీర్), ఈ కార్యక్రమాన్ని కో-ఆర్డినేటర్ గా గాజుల ప్రతాప్ (రిటైర్డ ప్రిన్సిపాల్) నిర్వహిస్తున్నారు. ఉచిత ఇంజనీరింగ్ కోచింగ్ పేద విద్యార్థు లకు అనగా జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో చదివే సైన్స్ విద్యార్థిని విద్యార్థులకు అందరికీ ఉచిత ఎంసెట్ కోచింగ్ తో పాటు ఉచిత మెటీరియల్ అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థు లు ఉపయోగించుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని వారి ఆలోచన. ఈ అవకాశాన్నిచ్చిన కళాశాల ప్రిన్సిపాల్ కె విజయ రఘునందన్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బుర్ర వెంకటేశం, సామల వివేకానంద, రవీందర్, గెంట్యాల రాజశేఖర్, కోడం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో దారుణం!

**స్నేహితుడిని చెట్టుకు కట్టేసి, అతని కళ్లెదుటే 18 ఏళ్ల యువతిపై సామూహిక అత్యాచారం**

**ఐదుగురు నిందితుల అరెస్టు**



**ప్రజానావ,ముంబై:** మహారాష్ట్ర,అమరావతిలో ఒక యువతిపై జరిగిన దారుణమైన సామూహిక అత్యాచార ఘటన వెలుగులోకి వచ్చింది. నిందితులు మొదట 18 ఏళ్ల కళాశాల విద్యార్థినిని, ఆమె స్నేహితుడిని రోడ్డుపై ఆపి కొట్టారు. ఆ తర్వాత, వారు ఆ యువకుడిని కట్టేసి, అతని కళ్లెదుటే యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో నిందితులైన ఐదుగురినీ పోలీసులు దర్యాప్తు జరిపి 12 గంటల్లోనే అరెస్టు చేశారు. ఫ్రేజర్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భాంఖేడా అటవీ ప్రాంతంలో ఒక యువతిపై జరిగిన దారుణమైన సామూహిక అత్యాచార ఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో ఆ ప్రాంతంలో కలకలం రేగింది. తన స్నేహితుడితో కలిసి బైక్‌పై షికారుకు వెళ్లిన యువతిని, కొందరు గుర్తుతెలియని నిందితులు అడవిలోకి లాక్కెళ్లి అత్యాచారం చేసినట్లు సమాచారం. ఈ ఘటన గురించి సమాచారం అందిన వెంటనే పోలీసులు దర్యాప్తు ప్రారంభించి ఐదుగురిని అరెస్టు చేశారు. ఆ వీడియోను నిందితుడు చిత్రీకరించాడు. దిగ్భ్రాంతికరంగా, నిందితులు అత్యాచారాన్ని వీడియో తీశారు. ఈ విషయం ఎవరికైనా చెబితే, ఆ వీడియోను వైరల్ చేస్తామని వారు ఆ బాలికను బెదిరించారు. పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల కథనం ప్రకారం, బాధితురాలు తన స్నేహితుడితో కలిసి మోపెడ్‌పై తిరిగి వస్తుండగా ఐదుగురు వ్యక్తులు ఆమెను అడ్డగించారు. వారు వారిద్దరినీ అడవిలోకి లాక్కెళ్లి డబ్బు కోసం కొట్టడం ప్రారంభించారు. బాధితురాలు వారికి తన దగ్గర ఉన్న రూ. 120 ఇచ్చింది. అయినా, ఆ తర్వాత వారు ఆమెపై అత్యాచారం చేశారు. ఘటనపై సమాచారం అందుకున్న అనంతరం, పోలీస్ కమిషనర్ రాకేష్ ఓలా మార్గదర్శకత్వంలోని బృందాలు రాత్రంతా అడవిలో గాలించాయి. అనంతరం, ఆదివారం ఉదయానికల్లా పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసులో సామూహిక అత్యాచారం, దోపిడీ కేసు నమోదు చేశారు. బాధితురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. పోలీసులు ఈ విషయంపై మరింత దర్యాప్తు చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# 40 కోట్ల నిధులను తిరిగి మంజూరు చేయాలి

- టెండర్ల ప్రక్రియ జరిగిన పనులను కొనసాగించాలి
- ప్రభుత్వానికి నివేదించాలని కౌన్సిల్ సమావేశంలో సభ్యులతో కలిసి చైర్ పర్సన్‌కు కౌన్సిలర్ గుండ్లపల్లి నీరజ వినతి




**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపాలిటీకి ప్రభుత్వం వివిధ అభివృద్ధి పనులకు గత ప్రభుత్వం రూ.40 కోట్ల నిధులను మంజూరు చేసి టెండర్ ప్రక్రియ కూడా పూర్తి అయినప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిధులను నిలిపివేసిందని 17వ వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ పూర్ణచందర్ మున్సిపల్ సమావేశంలో ఆరోపించారు. మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ సమావేశం జరిగింది. సమావేశంలో గుండ్లపల్లి నీరజ పూర్ణచందర్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల పాలనలో సిరిసిల్ల పట్టణ అభివృద్ధి కొరకు విడతల వారిగా ఎన్నో నిధులను కేటాయించి తెలంగాణా రాష్ట్రంలోనే సిరిసిల్ల పట్టణాన్ని ముందు వరుసలో ఉంచే ప్రయత్నం చేసిందన్నారు. ఇందు కోసం స్థానిక శాసనసభ్యులు, అప్పటి పురపాలక శాఖ మంత్రివర్యులు కల్వకుంట్ల తారకరామారావు ప్రత్యేక దృష్టి సారించి సిరిసిల్ల మునిసిపాలిటీకి నిధులను కేటాయించారన్నారు. ఇందులో బాగంగా చివరి విడుతలో రూ.40 కోట్లను వివిధ అభివృద్ధి పనుల కొరకు మంజూరి చేయింవారని, దాదాపు టెండర్ ప్రక్రియ కూడా పూర్తీ అయిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సిరిసిల్ల మునిసిపాలిటీని చిన్న చూపు చూస్తూ మంజూరైన నిధులను కూడా నిలుపుదల చేయించారన్నారు. ఈ కారణంగా సిరిసిల్ల మునిసిపల్ పరిధిలో జరుగవలసిన అభివృద్ధి పనులు నిలిచిపోయి అగ్రగామిగా ఉన్న సిరిసిల్ల పట్టణం ఇప్పుడు వెనక్కి నెట్టవేయడం జరుగుతుందని, పట్టణ అవసరాల దృష్ట్యా అభివృద్ధి కొరకు ఇట్టి నిధులు చాలా అవసరము కనక కౌన్సిల్ పక్షాన ఈరోజు జరుగుతున్న సమావేశం లో పెండింగ్ నిధులను వెంటనే మంజూరి చేయించి ముందుకు వెళ్ళేలా ఈ అంశాన్ని చేర్చి, దీనిపై కౌన్సిల్ పక్షాన తీర్మాణం చేసి, ఈ ప్రతిని పురపాలక శాఖ మంత్రి, ముఖ్యమంత్రి కి, అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత శాఖ అధికారులకు పంపవలసిందిగా కోరారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు అభయహస్తం మేనిఫెస్టో లో 420 హామీలను ఇచ్చారని, వాటిలో ఒకటి "పట్టణ, మునిసిపాలిటీలలో ఉన్న చిరు వ్యాపారులకు తైబజారు పన్ను రద్దు చేస్తాం" అని హామీ ఇవ్వడం జరిగిందని, వారి హామీ ప్రకారంగా తైబజారు పన్నును రద్దు చేసి చిరు వ్యాపారులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరుతూ మునిసిపల్ కౌన్సిల్ పక్షాన ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని నీరజ కోరారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి కి కౌన్సిలర్లతో కలిసి సమర్పించారు.

# పూణే ఐటీ ఉద్యోగ నియామకాల కుంభకోణం

- పూణేలో ఐటీ ఉద్యోగాల ముసుగులో ఒక భారీ కుంభకోణం వెలుగులోకి..
- వందలాది మంది యువత నుంచి కోట్ల రూపాయలు కాజేసినట్లు ఆరోపణలు
- మహా రాష్ట్ర ముఖ్యమంత్రి సిట్ దర్యాప్తునకు ఆదేశం




**ప్రజానావ, ముంబై:** పుణెలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతను మోసం చేస్తున్న ఒక భారీ ఐటీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఉద్యోగం కోసం లక్షల రూపాయలు చెల్లించిన వందలాది మంది పూణె యువకులు దారుణమైన పరిస్థితిలో చిక్కుకున్నారు. వారికి జీతం, అనుభవ ధృవీకరణ పత్రం అందలేదు, వారి డబ్బు కూడా తిరిగి రాలేదు. పోలీసుల ప్రకారం, పూణెలోని క్వాంటమ్ సాఫ్ట్ టెక్నాలజీస్, ఫైనాట్ సాస్, డేటాటెక్ ల్యాబ్స్ అనే మూడు కంపెనీలతో సహా కనీసం 10 ఐటీ కంపెనీలు ఉద్యోగాల పేరిట మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాయి. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ సిట్ ఏర్పాటుకు ఆదేశించారు.

27 ఏళ్ల సృష్టి (పేరు మార్చబడింది) రెండు సంవత్సరాలుగా ఉద్యోగం కోసం వెతుకుతోంది. సెప్టెంబర్‌లో ఒక నియామక కన్సల్టెంట్ ఆమెకు క్వాంటమ్ సాఫ్ట్‌లో ఉద్యోగాన్ని ఆఫర్ చేశారు. రూ. 6 లక్షల వార్షిక ప్యాకేజీకి రూ.2.5 లక్షలు, రూ. 11 లక్షల వార్షిక ప్యాకేజీకి రూ.3.25 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది అని ఆమెకు చెప్పారు. 11 లక్షల వార్షిక వేతనానికి గాను తాను మొదటి విడతగా 2.75 లక్షలు చెల్లించానని సృష్టి చెప్పింది. జీతం మొదలయ్యాక మిగిలిన మొత్తాన్ని చెల్లించాల్సి ఉంది. ఆమె అక్టోబర్‌లో ఉద్యోగంలో చేరి, ఒక నెల పనిచేసి, మొదటి జీతం తీసుకుంది, అదే చివరిది. జనవరిలో డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగినప్పుడు, వెంటనే రాజీనామా చేస్తేనే డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పారు. ఇప్పటివరకు కేవలం 1.45 లక్షలు మాత్రమే తిరిగి ఇచ్చారు, మిగిలిన మొత్తం ఇంకా రావాల్సి ఉంది.

### బంధువుల దగ్గర అప్పు తీసుకొని..

యావత్మల్‌కు చెందిన ధ్రువ్ (పేరు మార్చబడింది) 2022లో పట్టభద్రుడయ్యాడు. అతను రెండు సంవత్సరాలకు పైగా ఉద్యోగం కోసం వెతుకుతున్నాడు. 2025 అక్టోబర్‌లో, అతనికి క్వాంటమ్‌సాఫ్ట్ నుండి ఆఫర్ వచ్చింది. "ఒక జాబ్ పోర్టల్ ద్వారా కన్సల్టెంట్ నన్ను సంప్రదించారు. 6 లక్షల వార్షిక వేతనానికి నేను సుమారు రూ. 3 లక్షలు చెల్లించాల్సి వచ్చింది. నేను అప్పులు చేసి, బంధువుల నుండి రుణాలు తీసుకుని ఆ డబ్బును సమకూర్చుకున్నాను." ఈరోజు, ధ్రువ్, సృష్టితో సహా 100 మంది ఉద్యోగులు పూణే లోని విమాన్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరో 300 మంది ఉద్యోగులు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు.

### మోసం చేసిన పద్ధతి ఏమిటి?

రెండు కంపెనీలలోనూ ఒక ఉమ్మడి ధోరణి కనిపించింది. క్వాంటమ్‌సాఫ్ట్, ఫైనాట్ సాస్‌లలో సుమారు 900 నుండి 1,000 మంది ఉద్యోగులు ఉండేవారు. నియామక కన్సల్టెంట్లు వారి నుండి రూ. 1.5 లక్షల నుండి రూ. 3.5 లక్షల వరకు ఫీజులు వసూలు చేసేవారు. ఈ డబ్బు కంపెనీ యాజమాన్యంతో పంచుకునేవారు. ఈ కుంభకోణంలో కనీసం 30 నియామక కన్సల్టెంట్లు, కన్సల్టింగ్ సంస్థలు పాలుపంచుకున్నాయని ఉద్యోగుల సంఘం ఫైట్ తెలిపింది. బాధితుల్లో ఎక్కువ మంది మహారాష్ట్రలోని యావత్ మాల్, అమరావతి, నాగ్‌పూర్, అహిల్యానగర్ వంటి చిన్న నగరాలకు చెందిన 2022-24 బ్యాచ్‌కు చెందిన యువ గ్రాడ్యుయేట్లు. వారికి బీఎస్సీ ఐటీ, ఎంసీఏ లేదా ఇంజనీరింగ్ డిగ్రీలు ఉన్నప్పటికీ, ఉద్యోగాలు లభించడం లేదు. హింజవాడి పోలీస్ స్టేషన్‌లో ఫైనాట్ సాస్ పై 354కు పైగా ఎఫ్ఐఆర్‌లు దాఖలయ్యాయి. 600 మందికి పైగా ఉద్యోగులు ప్రభావితులయ్యారు. హింజవాడి పోలీస్ స్టేషన్ దర్యాప్తు అధికారి హృషికేష్ ఘాడ్గే మాట్లాడుతూ, "కంపెనీ ఖాతాలో ఎలాంటి డబ్బు లేదు. కొత్తగా చేరిన ఉద్యోగులు జమ చేసిన డబ్బును నగలు, కార్లు, ఇళ్లు కొనడానికి ఉపయోగించారు. ఫైనాట్ సీఈఓ ఉపేష్ పాటిల్, డైరెక్టర్ రోహన్ అంబుల్కర్ నాగ్‌పూర్ నివాసి ప్రస్తుతం ఎనిమిది నెలల జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు."

### ప్రభుత్వం, పోలీసుల చర్యలు

అసెంబ్లీలో ఎమ్మెల్యే శంకర్ జగతాప్ ఈ విషయాన్ని లేవనెత్తిన తర్వాత, ఫైనాట్ కేసులో సిట్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఆదేశించారు. ఐటీ రంగ ఉద్యోగుల ఫిర్యాదులను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక స్వతంత్ర ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయనుంది. "ఈ విషయం ప్రధానంగా నేర స్వభావం కలది. పోలీసుల పరిధిలోకి వస్తుంది. కార్మిక చట్టాల ఉల్లంఘనపై దర్యాప్తు పూర్తయిన తర్వాత మేము చర్య తీసుకుంటాము," అని పూణే డిప్యూటీ లేబర్ కమిషనర్ నిఖిల్ వాల్కే అన్నారు.

# జనగణనలో మాస్టర్ ట్రైనర్లు కీలకం

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**సీఎంఎంఎస్, డిజిటల్ విధానం, హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ పై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ**




**ప్రజానావ, సిరిసిల్ల :** జనగణన-2027 లో మాస్టర్ ట్రైనర్లు కీలకమని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జనగణన 2027లో భాగంగా సెన్సస్ మానిటరింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్, (సీఎంఎంఎస్), డిజిటల్ విధానం, హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ పై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం జిల్లా సమీకృత కార్యాలయం సముదాయంలో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు కొనసాగుతుండగా, మంగళవారం కలెక్టర్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో డిజిటల్ విధానంలో జరిగే మొదటి జనగణనని వెల్లడించారు. మొదటి దశలో మే 11 వ తేదీ నుంచి జూన్ 09 వ తేదీ వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని, రెండో దశ ఫిబ్రవరి 2027 లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని తెలిపారు. జనగణన సేకరించే వివరాలు కీలకమని స్పష్టం చేశారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యతల నిర్వహణలో ఎంతో కీలకమని స్పష్టం చేశారు. వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయించాలని ఆదేశించారు. హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్, ఇతర అన్ని అంశాలపై డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్ మాస్టర్ ట్రైనర్ శివ రామ కృష్ణ పూర్తి స్థాయిలో వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతి అంశంపై తెలిపారు. ఈ శిక్షణలో జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, గణాంక అధికారి సంపత్ కుమార్, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.



# డయాబెటిస్ పేషెంట్స్ స్వీట్ కార్న్ తినవచ్చా?

డయాబెటిస్ పేషెంట్స్ తమ ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. తీపి పదార్థాలు అస్సలు తీసుకోకూడదు. ఎందుకంటే, దీని వల్ల ఆరోగ్యం మరింత దిగజారిపోతుంది. శీతాకాలంలో చాలా మంది స్వీట్ కార్న్‌ను తినడానికి ఇష్టపడ తారు. కానీ, మధుమేహ వ్యాధిగ్రస్తులు దీనిని తినడం ఆరోగ్యానికి మంచిదేనా? స్వీట్ కార్న్ తింటే ఏమవుతుందో ఇప్పుడు తెలుసుకుందాం..

**డయాబెటిస్ పేషెంట్స్ స్వీట్ కార్న్ తినవచ్చా?**

శీతాకాలంలో, చాలా మంది స్వీట్ కార్న్‌ను ఉడికించి ఉప్పు, కారం వేసుకుని తింటారు. కొంతమంది దీనిని సలాడ్‌లు, కూరగాయలలో కూడా ఉపయోగిస్తారు. ఇది ఆరోగ్యానికి ఎంత ఉపయోగకరంగా ఉంటుందో అంతే రుచికరంగా ఉంటుంది. స్వీట్ కార్న్‌లో ఇనుము, జింక్, రాగి, మాంగనీస్, సెలీనియం, విటమిన్ సి, విటమిన్లు బి1, బి2, బి3, బి6, ఎ2 వంటి ఖనిజాలు ఉంటాయి. ఈ పోషకాలన్నీ అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి. శరీర పోషక అవసరాలను తీర్చడంలో సహాయపడతాయి.

ఆరోగ్య నిపుణుల ప్రకారం, డయాబెటిస్ పేషెంట్స్ స్వీట్ కార్న్‌ను మితంగా తినవచ్చు. ఎందుకంటే ఇందులో ఫైబర్ ఉంటుంది. ఇది రక్తంలో చక్కెరను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. అయితే, దీనిని ఉడికించిన లేదా కాల్చిన ఫైబర్ అధికంగా ఉండే కూరగాయలతో మితంగా తినాలని నిపుణులు సూచిస్తున్నారు.

స్వీట్ కార్న్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది కార్బోహైడ్రేట్ల జీర్ణక్రియను నెమ్మదిస్తుంది. రక్తంలో చక్కెరలో ఆకస్మిక పెరుగుదలను నివారిస్తుంది. ఇది శక్తికి మంచి మూలం. బి విటమిన్లు, మెగ్నీషియం, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు జీవక్రియను నియంత్రించడంలో సహాయపడతాయి. ఉడికించిన మొక్కజొన్నలో గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.



# కాల్షియం లోపం.. ఈ లక్షణాలతో జాగ్రత్త.!

శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి కాల్షియం చాలా అవసరం. చిన్న పిల్లల నుండి పెద్దల వరకు అన్ని వయసుల వారికి కాల్షియం చాలా అవసరం. బలమైన ఎముకలను నిర్మించడం, గుండెతో సహా కండరాల సంకోచాలను నియంత్రించడం, బలమైన దంతాలు కలిగి ఉండటం లేదా ఆరోగ్యకరమైన నాడీ వ్యవస్థను నిర్వహించడం వంటి వాటికి కాల్షియం చాలా ముఖ్యం. తేలికపాటి కాల్షియం లోపం అలసట లేదా అసౌకర్యాన్ని కలిగించవచ్చు. దీర్ఘకాలిక, తీవ్రమైన లోపాలు గుండె సమస్యలకు దారితీయవచ్చు. కాల్షియం స్థాయిలు పడిపోయినప్పుడు ఈ లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయని నిపుణులు అంటున్నారు..

**తిమ్మిర్లు:**

కండరాల నొప్పి, కదలిక సమయంలో తొడలు, చేతుల్లో నొప్పి కలుగుతుంది. ఇందులో చేతులు, పాదాలు, కాలి వేళ్లలో తిమ్మిరి, జలదరింపు కూడా ఉండవచ్చు. కండరాల పనితీరుకు కాల్షియం చాలా ముఖ్యమైనది. కాల్షియం స్థాయిలు తక్కువగా ఉంటే, కండరాలు సరిగ్గా పనిచేయవని నిపుణులు అంటున్నారు.

**అలసిపోయినట్లు అనిపించడం:**

తక్కువ కాల్షియం స్థాయిలు తీవ్రమైన అలసటకు కారణమవుతాయి. ఇందులో శక్తి లేకపోవడం, నీరసం వంటి భావన కూడా ఉంటుంది. ఇది నిద్రలేమికి కూడా దారితీస్తుంది. కాల్షియం లోపం వల్ల తల తిరగడం, మతిమరుపు, గందరగోళం వంటి ప్రమాదం కూడా పెరుగుతుంది.

**పెళుసైన గోర్లు:**

గోళ్లను ఉపయోగించి కాల్షియం స్థాయిలను గుర్తించవచ్చని నిపుణులు అంటున్నారు. శరీరంలో కాల్షియం లేకపోతే, గోళ్లు పెళుసుగా మారుతాయని, గోళ్ల చివరలు విరిగిపోతాయని చెబుతారు.

**దంతక్షయం :**

కాల్షియం పంటి ఎనామిల్‌లో ఒక ముఖ్యమైన భాగం. ఇది ఎనామిల్‌ను రక్షిస్తుంది. తగినంత కాల్షియం లేకపోతే, ఎనామిల్ బలహీనపడుతుందని, దంతక్షయం వంటి సమస్యలకు దారితీస్తుంది. కాల్షియం లోపం వల్ల జుట్టు విరిగిపోయి ముక్కలుగా రాలిపోతుంది. తామర, చర్మం వాపు, దురద లేదా పొడి మచ్చలు సంభవించవచ్చు.

**ఆర్థరైటిస్:**

బలమైన, ఆరోగ్యకరమైన ఎముకలకు కాల్షియం చాలా ముఖ్యమైనది. దీర్ఘకాలిక కాల్షియం లోపం ఎముకలను బలహీనపరుస్తుందని, ఆర్థరైటిస్ వంటి పరిస్థితులకు దారితీస్తుందని చెబుతారు.

**కాల్షియం కోసం ఏం తినాలి?**

కాల్షియం పొందడానికి మీరు ప్రతిరోజూ కొన్ని ఆహారాలు తినాలని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా పాలు, పెరుగు, జున్ను, సలాడ్, కాలే వంటి ఆకుపచ్చ కూరగాయలు తీసుకోవాలి. బాదం, సోయా ఉత్పత్తులు, టోఫు, జున్ను కూడా తీసుకోవచ్చు. సాల్మన్, సార్డిన్ వంటి చేపలను కూడా తినాలని నిపుణులు సూచిస్తున్నారు.

# కోఆప్షన్ సభ్యుల ఎంపికకు గ్రీన్‌సిగ్నల్

- నోటిఫికేషన్ జారీ చేసిన మున్సిపల్ కమిషనర్
- మైనారిటీలు, ప్రత్యేక పరిజ్ఞానం ఉన్నవారికి అవకాశం
- నాలుగింట్లో మహిళలకు రెండు స్థానాలు
- ఈ నెల 7వరకు దరఖాస్తుల స్వీకరణ



**ప్రజానావ, సిరిసిల్ల:** సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్‌లో నలుగు రు కోఆప్షన్ సభ్యుల ఎంపికకు మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా మంగళవారం సాయంత్రం నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో ఇద్దరిని ప్రత్యేక పరిజ్ఞానం, అనుభవం కలిగిన వ్యక్తుల నుంచి ఎంపిక చేయనుండగా, మరో ఇద్ద రిని మైనారిటీ వర్గాలకు కేటాయించారు. ప్రత్యేక పరిజ్ఞానం, అనుభవం ఉన్న కోఆప్షన్ సభ్యులలో ఒక స్థానం మహిళకు, మరొకటి పురుషుడికి కేటాయించారు. ఇదే విధంగా మైనారిటీ కోఆప్షన్ సభ్యులలో కూడా ఒక స్థానం మహిళకు, మరొకటి పురుషుడికి కేటాయించారు. ఈ పదవులకు అర్హతలు కలిగిన అభ్యర్థుల నుంచి ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 7 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అయితే దరఖాస్తులను ఏప్రిల్ 5 సాయంత్రం 5 గంటల లోగా మున్సిపల్ కార్యాలయంలో సమర్పించా లని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతలను తప్పనిసరి గా పూర్తిచేసి ఉండాలని కమిషనర్ సూచించారు. మొత్తం నాలుగు కోఆప్షన్ సభ్యుల నియామక ప్రక్రియను పార దర్శకంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# తండ్రిపై కోపం.. మూడున్నరేళ్ల బాలుడిపై దాడి

- ఆటో డ్రైవర్ క్రూరత్వం
- తీవ్ర గాయాలతో ఐసీయూలో చిన్నారి
- నిందితుడు సందీప్ పవార్ అరెస్ట్

**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్ర రాష్ట్రంలోని పాల్ఘర్ జిల్లా వసాయి ప్రాంతంలో మానవత్వాన్ని కకావికలం చేసే ఘటన వెలుగులోకి వచ్చింది. తండ్రితో ఉన్న పాత వివాదానికి ప్రతీకారం తీర్చుకోవాలని భావించిన ఒక ఆటోరిక్షా డ్రైవర్, మూడున్నరేళ్ల అమాయక బాలుడిపై అత్యంత క్రూరంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆ చిన్నారి ప్రస్తుతం ఆసుపత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనకు పాల్పడిన సందీప్ పవార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నిందితుడు సందీప్ పవార్ బాలుడి తండ్రి అతుల్ కొంధారే ఒకే నివాస సముదాయంలో నివసిస్తున్నారు. కొంతకాలం క్రితం వారిద్దరి మధ్య జరిగిన గొడవను మనసులో పెట్టుకున్న సందీప్, ప్రతీకారం తీర్చుకోవడానికి అవకాశం కోసం ఎదురు చూశాడు. మంగళవారం సాయంత్రం సుమారు 8 గంటల సమయంలో, విఘ్నేష్ అనే బాలుడు భవన ఆవరణలో ఆడుకుంటూ ఒక ఆటోరిక్షాలో కూర్చున్నాడు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన సందీప్ పవార్ బాలుడిని దారుణంగా పట్టుకుని రిక్షా మీటర్ దగ్గర ఉన్న ఇనుప యాంగిల్‌కు అతని తలను బలంగా కొట్టాడు. అనంతరం అతడిని రిక్షా నుంచి బయటకు లాగి గాలిలోకి విసిరి నేలపై పడేశాడు. ఇక్కడితో ఆగకుండా బాలుడిని లాగుతూ మెట్ల వైపు తీసుకెళ్లి మళ్లీ దాడి చేశాడు.

ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన చిన్నారి విఘ్నేష్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ అమానుష ఘటన వసాయి ప్రాంతంలో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. చిన్న విషయంపై ప్రతీకారం తీర్చుకోవడానికి ఒక పసివాడిపై ఇంతటి దారుణానికి పాల్పడడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసు గురించి వసాయి పోలీస్ స్టేషన్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ ఘుడిగావ్‌కర్ మాట్లాడుతూ.. నిందితుడు, బాలుడి తండ్రి మధ్య పాత వివాదమే ఈ దాడికి కారణమని తెలిపారు. పోలీసులు వెంటనే స్పందించి నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

# భీమేశ్వర స్వామి ఆదాయం రూ. 93.52 లక్షలు

**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి ఆలయంలో గత 18 రోజుల కాలంలో భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ కాలంలో హుండీ ద్వారా మొత్తం రూ.93,52,748 నగదు రూపంలో ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అలాగే భక్తులు సమర్పించిన మిశ్రమ బంగారం 60 గ్రాములు 100 మిల్లీగ్రాములు, మిశ్రమ వెండి 2 కిలోల 900 గ్రాములు లభించినట్లు పేర్కొన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ ఈవో రమాదేవి, కరీంనగర్ ఏసీ కార్యాలయానికి చెందిన రాజమౌళి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారులు, ఇతర అధికారులు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బందితో పాటు శివరామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



# గ్రామ చీకట్లు తొలగించా

- వంద రోజుల్లో అభివృద్ధి, మౌలిక వసతులపై దృష్టి సారించా
- మహిళా సాధికారతకు ప్రాధాన్యం
- ప్రజల నమ్మకానికి తగినట్లు సేవలందిస్తా
- శాయంపేట సర్పంచ్ సురేందర్ రావు



**ప్రజానావ, జమ్మికుంట:** జమ్మికుంట మండలం శాయంపేట గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి వంద రోజుల్లో గ్రామాభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదలపై పలు కీలక కార్యక్రమాలు చేపట్టినట్లు సర్పంచ్ మడికొండ సురేందర్ రావు తెలిపారు. గ్రామ ప్రజలు ఇచ్చిన బాధ్యతను నెరవేర్చే క్రమంలో పారదర్శకంగా, ప్రజా సంక్షేమం దృష్ట్యా పనులు కొనసాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామంలో ఎక్కడా చీకటి లేకుండా వీధి దీపాలు, ముఖ్యంగా ప్రధాన రహదారులపై ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందేలా పైపులైన్ లీకేజీల మరమ్మతులు, గేట్ వాల్వ్‌ల సరిదిద్దడం, కొత్త మోటార్ ఏర్పాటు వంటి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పంచాయతీ సిబ్బందితో నిత్యం రహదారులు, డ్రైనేజీలను శుభ్రపరచించడం, దోమల నివారణ కోసం ఫాగింగ్ నిర్వహించడం చేపట్టామన్నారు. రోడ్ల పక్కన పెరిగిన గడ్డిని తొలగించడం కోసం డోజర్‌తో శుభ్రపరిచే పనులు చేయించడంతో పాటు గడ్డి మందు స్ప్రే చేయించారు.

**మహిళలకు ప్రోత్సాహం**

మహిళా సాధికారత దిశగా మహిళలతో గ్రామసభలను నిర్వహించి వారికి ప్రోత్సాహం అందించారు. గ్రామంలోని పోచమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. అలాగే పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల పనితీరును పర్యవేక్షించడం, యువతను క్రీడల్లో ముందుకు తీసుకెళ్లేలా కార్యక్రమాలు నిర్వహించారు. 15 ఏళ్లు పైబడిన నిరక్షరాస్యుల కోసం ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా, డిజిటల్ నైపుణ్యాలను అందించేందుకు 102 మంది మహిళలకు 'ఉల్లాస్ పరీక్ష' నిర్వహించారు. గ్రామాభివృద్ధి పనుల్లో కీలకపాత్ర పోషిస్తున్న పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. గ్రామాభివృద్ధి కోసం తరచూ పాలకవర్గ సమావేశాలు, గ్రామసభలు నిర్వహిస్తూ ప్రజల అభిప్రాయాలను తీసుకుంటున్నట్లు తెలిపారు. కేవలం 100 రోజుల్లోనే ఈ స్థాయిలో అభివృద్ధి సాధించామని, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా గ్రామ ప్రజల సేవలో కొనసాగుతానని సర్పంచ్ మడికొండ సురేందర్ రావు స్పష్టం చేశారు.





# జనరల్ అనస్థీషియా లేకుండానే ఆపరేషన్

- వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స
- వైద్య బృందంపై సూపరింటెండెంట్ ప్రశంసలు

**ప్రజానావ, వేములవాడ:** జగిత్యాల జిల్లాకు చెందిన 60ఏళ్ల మహిళ రొమ్ములో గడ్డ సమస్యతో వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని ఆశ్రయించింది. షుగర్ వ్యాధితో చాలాకాలంగా బాధపడుతున్న ఆమెకు నోరు పూర్తిగా తెరవడంలో కూడా ఇబ్బంది ఉండడంతో జనరల్ అనస్థీషియా ఇవ్వడం సాధ్యం కాలేదు. ఈ పరిస్థితుల్లో ఆమెను హైదరాబాద్ వంటి పెద్ద ఆసుపత్రికి తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే మత్తు వైద్యులు డా. తిరుపతి, డా. రాజశ్రీల సలహాతో అరుదైన విధానమైన సెగ్మెంటల్ థొరాసిక్ ఎపిడ్యూరల్ అనస్థీషియా ద్వారా ఇక్కడే శస్త్రచికిత్స నిర్వహించాలని సీనియర్ సర్జన్ డా. పెంచలయ్య నిర్ణయించారు. అనంతరం వైద్యులు డా. మోహన్ కృష్ణ, డా. అలేఖ్యలతో పాటు మత్తు వైద్యుల బృందం సమన్వయంతో ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రవీందర్ అభినందించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో సాధారణ కాన్పులు, శస్త్రచికిత్సలు సజావుగా జరుగుతున్నాయని, ప్రజలు సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

